కథ

# డిసిప్లిన్!

గుడిమెట్ల గోపాలకృష్ణ

హోటల్ 'భీమాస్'లో పిల్లలకీ, మాకూ విడివిడిగా టిఫిన్లు పేక్ చేయించాను.

లక్ష్మి ఈసారి 'తిరుమల-తిరుపతి' యాత్ర చాలా మెచ్చుకుంది. గంటలతరబడి క్యూలూ అవీ లేకుండా చాలా ఖాళీగా ఉండడం వల్ల వేంకటేశ్వరస్వామివార్ని రెండుసార్లు దర్శించుకున్న ఆనందం ఆమె ముఖంలో ద్యోతకమౌతోంది.

తిరుపతి వైజాగ్ తిరుమల ఎక్స్‌ప్రెస్ అయిదోనంబరు ప్లాట్‌ఫారం నుంచి ఏడుగంటలకు బయల్దేరడానికి సిద్ధంగా ఉందని బోధపడని మూడు భాషల్లో అనౌన్సర్ అరుస్తున్నాడు.

మళ్లీ ఒక నిముషం తర్వాత కంప్యూటరైజ్డ్ ఎనౌన్స్‌మెంట్ చక్కగా వివరించడం మన పురోభివృద్ధిని చెప్పకనే చెబుతోంది.

సూట్‌కేసుల సంరక్ష పెద్దమ్మాయి సంతోషి, బడ్జెట్, ఖర్చులు వగైరా, మార్కెటింగ్, కేటరింగ్ ఎక్స్‌ట్రా శైలు చిన్నమ్మాయికి కేటాయించాం.


లక్ష్మి చేతిలో ఎప్పుడూ నోట్‌బుక్ వుంటుంది. యాత్రా విశేషాల్ని నోట్ చేసుకుని రచయిత్రిగా తన ప్రతాపం జనాలకు వదలడానికి!

తమిళనాడు, కేరళా అయిపోయేక ఆఖరుగా తిరుపతి చూసేసి ట్రయినెక్కేశాం.

ఎ.సి. స్లీపరులో నలుగురికీ ఒకే దగ్గర ఇచ్చిన రైల్వే కంప్యూటర్‌కు రిజర్వేషన్ క్లర్క్‌కు ధన్యవాదాలు మరోసారి అర్పించుకున్నాం.

ఎదురుగా సైడు రెండు బెర్తుల్లో యంగ్ కపుల్..

అవతలి నాలుగు బెర్తుల్లో పిల్లలు, ఫ్యామిలీ విపరీతమైన అల్లరి చేస్తున్నారు. ట్రైన్ స్టార్టయిపోతే బావుణ్ణనిపించింది.



అవును మరి! బదరాబందీలు, లోకంపోకడలు అన్నీ వదిలేసి హాయిగా 'జర్నీ' మాత్రం ఎంజాయ్ చేసేవాళ్లే ఎక్కువయ్యేరు. కాళహస్తి దాటుతున్నప్పుడు లక్ష్మి మరోసారి దణ్ణం పెట్టింది. గూడూరు వదిలేశాక టిఫిన్లు పూర్తి చేశాం. లక్ష్మి మాత్రం అసహనంగా వుంది. కారణం సైడ్‌లోయర్ బెర్తులో వున్న యంగ్‌కపుల్ వెకిలి చేష్టలు.

పబ్లిక్‌ప్లేస్ అని గమనించకుండా ఒకళ్లమీద ఒకరు పడడం, కౌగలించుకోడాలు... పకపకలు వికవికలు... చాలా ఎంబ్రాసింగ్ సిట్యుయేషన్! ప్రక్క పిల్లలు... అటు పక్క వాళ్లు! కర్టెన్స్ వేసేసింది లక్ష్మి. ఇంకా తొమ్మిదయినా కాలేదు. అప్పుడే కర్టెన్లు వేశాసేవేం అన్నాను. చెవిలో గుసగుసలాడింది. "పిల్లలు వాళ్ల పక్కే చూస్తున్నారు." పెద్దమ్మాయి ఉద్యోగం అయ్యేక ఇదే రావడం. ఆ మొక్కే ఈ తిరుపతి ప్రయాణం.

మెల్లమెల్లగా ట్రైన్ స్పీడు అందుకుంది. నిద్రాదేవి ఒడిలోకి జారుకున్నాం.

000

ప్రక్కబెర్తులో వాళ్ల 'సెల్' మ్రోగింది.

"అవును... తిరుమలలో వచ్చేస్తున్నాం" అంది ఆమె. టైమ్ చూసుకున్నాను... పదకొండు!

"హేపీగానే జరిగింది. కొండమీద దర్శనం ఇవాళే జరిగింది. కంప్యూటర్ బేండులు వేయడం ప్రారంభించాకా దర్శనాలన్నీ రివర్సులో జరుగుతున్నాయి మమ్మీ... ముందు గోవిందరాజులు, అలివేలు మంగాపురం అన్నీ చూశాక మీదకి వెళ్లాం...హలో...హలో...అవును...మీకందరికీ లడ్డూలు తెస్తున్నాం. వుంటాను..." బిగ్గరగా పక్కబెర్తులో ఆవిడ గొంతు.

"ఏయ్...హనీ...ఎవరు? మీ మమ్మీయా...?" మీది బెర్తులో ఆమె భర్త.

"అవును హజ్... నిద్రపడుతోందా?" పల్కరింపు.

"ఎలా పడుతోంది? నువ్వు కూడా మీద బెర్తుమీద కొచ్చేయకూడదూ" కవ్వింపుగా అతను.

ఇంతలో మళ్లీ సెల్ మ్రోగింది.

"హల్లో... చిన్న... అవును తిరుమలలో వచ్చేస్తున్నాం. కారు తీసుకొని

క్లైమాక్స్‌కు రా..."

"—"

"జర్నీ బాగానే ఎంజాయ్ చేశాం. మీ బావగారు ఊటీ కూడా వెళ్తామన్నారు. నాకే డ్యూటీలో జాయినవ్వాలని వచ్చేస్తున్నాం"

"—"

"ఏది లడ్జీలు దొరికాయి. డోనరుగారి లెటరు పట్టుకెళ్లాం. కాబట్టి కాటేజ్ వేగం దొరికిపోయింది..."

"—"

"వుంటాను"

పిల్లలకూ, మాకూ నిద్ర వటాపంచలైంది.

ఆమె రెండుసార్లు లైట్లు వేసి ఆర్పింది.

నానా రకాలుగా 'హింస' అనుభవిస్తున్నాం. ఎ.సి. కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణించే 'జనం' ఇలా వుంటే ఇక 'జనరల్'లో ఎలా వుంటుందో కదా! పోస్ట్‌గ్రాడ్యుయేట్లు, పి.హెచ్‌డి.లు, ఐ.ఎ.యస్‌లు అయితే ఏం లాభం? తోటి ప్రయాణీకుల్ని డిస్టర్బ్ చెయ్యకూడదనే 'సివిక్' సెన్సు లేకపోయాక...

ఎన్నో యేళ్లుగా ప్రయాణంలో 'ఆనందం' పొందుదామనుకుంటే ఇలా పటాపంచలైంది.

పెద్దమ్మాయి అడుగుతానంది. లేనిపోని గొడవలు అని ఊరుకోమన్నాం. మెల్లగా నిద్రలోకి జారుకున్నాం.

000

కేవ్... కేవ్... బిగ్గరగా పిల్ల ఏడుపు!

"పాలివ్వకూడదూ..." ఆమె భర్త. అవతలివైపు బెర్తులోంచి.

"ఇచ్చాను. పాప ఏడ్పుమానలేదండీ"

"ఇప్పుడెలా?"

"దీనికంతటికీ ఆ సెల్‌ఫోనావిడ కారణమండీ. ఫోనులో బిగ్గరగా అరవడం వల్ల పాప తుళ్లిపడి లేచిపోయింది"

పాప ఏడ్పు ఆవలేదు కదా మరింత ఎక్కువగా లంకించుకుంది.

కంపార్ట్‌మెంట్‌లో సగానికి పైగా నిద్రలేచిపోయారు.

రాత్రి 1.30.

కొంతమంది మనకెందుకులే అని నిద్ర వటిస్తున్నారు.

ఇంతలో సైడ్‌బెర్తావిడ వాగ్యుద్ధానికి దిగింది ఇంగ్లీషులో...

"పిల్లల్ని పెంచడం రానప్పుడు కనడం ఎందుకో..."

"నీ సెల్‌ఫోను వల్లే నా పిల్ల లేచిపోయింది"

ఇంగ్లీషులో ఎవరికీ ఎవరూ తీసిపోనట్లుంది!

"నీ... నీ... అంటావేం... మర్యాదలేకుండా"

"నీకేం మర్యాద. తోటి ప్రయాణీకులు నిద్రపోతున్నారనైనా గమనించకుండా సెల్‌ఫోనులో అరవడం, ఓ పక్క చిన్నచిన్న పిల్లలున్నారన్న ఇంగితజ్ఞానం లేకుండా వాటేసుకోవడాలునూ..."

వాగ్యుద్ధం తీవ్రతరం అయింది.

కండక్టరు పక్క కంపార్ట్‌మెంట్‌లో వున్నట్టుంది.

పిల్లలూ, లక్ష్మి కూడా ఈ సీనుకు లేచిపోయారు.

కంపార్టుమెంట్ గందరగోళంగా వుంది. ఆడాళ్లిద్దరూ జుత్తులు పట్టుకోవడమే బాకీ.

ఈసారి పెద్దమ్మాయి సంతోషి ఊరుకోలేదు.

"మీకిద్దరికీ సివిక్ సెన్స్‌లేవు మేడమ్‌గార్లూ. సెల్‌ఫోనులో మీరు ఇన్ని అరుపులు అరుస్తుంటే ఎవరు నిద్రపోగలరు? వేలకువేలు పోసి ఎ.సి. టిక్కట్లు కొనుక్కొని దీనికోసమేనా జర్నీ చేసేది? అవతల కారిడార్లో కెళ్లి ఫోను ఎటెండవ్వచ్చుకదా"

అందరూ సంతోషికి సపోర్టు చేశారు.

"నేనెవరో తెల్సా. డిప్యూటీ కలెక్టర్ని"

ఈసారి సైడ్ బెర్తావిడ మరికొంచెం చెలరేగింది.

"సో వాట్? అందుకే ఈ దేశంలో 'డిసిప్లిన్'కింత దుర్గతి పట్టింది. ఆ హోదా చెప్పుకోడానికి మీకు సిగ్గనిపించడం లేదూ?"

"ఏంటి దబాయిస్తున్నావు?"

"ఇంక మీరు అల్లరి చేశారంటే న్యూసెన్స్ కేసు కింద బుక్ చేయిస్తాను. బండి కదలకుండా అలారం లాగి మీ సంగతి తేలుస్తాను. ఏదో చిన్నపిల్ల తెలీక ఏడిస్తే పెద్దవాళ్లయి మీరు రెచ్చిపోతున్నారే..."అనర్గళమైన ఇంగ్లీషులో సంతోషి.

సైడ్ బెర్త్ మీద భర్త తెల్లమొహం వేశాడు.

"డోన్ట్‌టాక్ రబ్బిష్"

"రబ్బిషా? మీకు ఐ.ఎ.ఎస్ అయితే నేను కరాటే నేర్చుకున్న ఐ.పి.ఎస్.ని. మరొక్కమాట నోటి నుంచి వచ్చిందంటే పదహారు పళ్లూ వూడిపోతాయి" సంతోషిలో అంతటి కోపం ఎప్పుడూ చూడలేదు.

ఏం అనుకుందో పక్క సర్దుకుని లైటార్పేసి గప్‌చుప్‌గా పడుకుంది.


ఎవరి బెర్తుల్లోకి వాళ్లు వెళ్లిపోయారు.

తన పని అయిపోయినట్లు 'పాప' ఊరుకుంది.

పాపతల్లి కృతజ్ఞతా భావంతో మాపక్క చూసింది.

తర్వాత ట్రైన్ 'డిసిప్లిన్'గా అరుచుకుంటూ పరుగుదీసింది!

■



## మరోసారి ఆక్షన్ హీరో అని నిరూపించుకున్నాడు!

పెళ్లయ్యాక చిత్రాలు తగ్గిన ఖిలాడీ కుమార్ అక్షయ్, మరో సారి సాహసం చేశాడు. రకరకాల విన్యాసాలు చేస్తూ ఎప్పుడూ వార్తల్లో వుండే అక్కీ, ఇటీవల ఓ సాహసం చేశాడు. కానీ అది సినిమా కోసం మాత్రం కాదు. తన సరసన నటిస్తున్న హీరోయిన్ ప్రాణం కాపాడేందుకు ఆ సాహసం చేశాడు. అక్కీ, ప్రియాంకాచోప్రా చేస్తున్న 'అందాజ్' చిత్రం కోసం దక్షిణాఫ్రికాలోని కేప్ టౌన్‌కు వెళ్లారు. సముద్రతీరంలో నడుస్తున్న అక్కీనీ, మరో హీరోయిన్ లారాదత్తానూ అకస్మాత్తుగా విపరీతవేగంతో వచ్చిన అల ఒకటి సముద్రం లోపలికి లాగేసింది. అక్కీ అయితే తప్పించుకున్నాడు కానీ, లారా మాత్రం సముద్రం లోపలికి వెళ్లిపోయింది. లారా ఈదుకుంటూ బయటికి వచ్చేస్తుందని అందరూ అనుకున్నారట కానీ, అట్లా జరగలేదు. "కాపాడండి!" అని కేకలు పెడుతూ, మునుగుతూ తేలుతూ వుంది నీటిలోనే. ఆ కేకలు విన్న అందరూ భయంతో వణకసాగారు కానీ, హీరో అక్కీ చటుక్కున నీటిలోకి దూకేసి లారాను బయటికి లాక్కొచ్చేశాట్ట. ఈ సాహసాన్ని 'అందాజ్' యూనిట్ వాళ్లింకా చెప్పుకుంటూనేవున్నారట.

ఎస్.